సాక్షి
వనపర్తి
గురువారం । 7 । మార్చి । 2024



చెంచుల పండుగకు సిద్ధం

నల్లమలలోని భౌరాపూర్‌లో నిర్వహించే చెంచుల పండుగకు సర్వం సిద్ధం చేశారు.

వివరాలు 8లో ▸



జోగుళాంబకు ప్రత్యేక పూజలు

జోగుళాంబ అమ్మవారికి బుధవారం అర్చకులు అష్టబంధన ద్రవ్యాలు సమర్పించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4 /20.8

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వేదికపై మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఢిల్లీలో అధికార ప్రతినిధి మల్లురవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, పర్ణికారెడ్డి, రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ నాయకులు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి తదితరులు

పాలమూరు బాధ్యత నాదే..

దేశంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం

- విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తాం
- కాంగ్రెస్ ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబ్‌నగర్ నుంచే హస్తం లోక్‌సభ ఎన్నికల శంఖారావం

సాక్షి, నాగర్‌కర్నూల్/ పాలమూరు: 'పాలమూరులో విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తగిన నిధులు కేటాయించి వేగంగా పూర్తి చేస్తాం.. దేశంలోనే పాలమూరు ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.. ఇక్కడి బిడ్డగా పాలమూరును అభివృద్ధి చేసే బాధ్యత నాదే' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' బహిరంగసభలో ఆయన పాల్గొని లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ 3,650 రోజులు, కేంద్రంలో మోదీ 3,650 రోజులు అధికారంలో ఉన్నారని.. వీళ్లు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కరీంనగర్ నుంచి పాలమూరుకు వస్తే ఆయనను ఇక్కడి ప్రజలు ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. ఆనాడు తుమ్మిళ్ల వద్ద కుర్చీ వేసుకొని ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి మరిచాడని, పదేళ్లు అయినా ఆ పనులు పూర్తి చేయలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి జిల్లాలో ఉన్న ఆర్డీఎస్, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి, కొడంగల్- నారాయణపేట ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వాలని, పచ్చని పంటలు పండాలనే ఉద్దేశంతో సమీక్ష చేశామన్నారు.

ఈ ధైర్యం ఇక్కడి బిడ్డల చలువే..

ఆనాడు హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడినప్పుడు నెహ్రూ పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావును మొదటి సీఎంగా చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ తర్వాత నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని.. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే ఈ పదేళ్లు దుర్మార్గుడు, దుష్టుడు రాష్ట్రాన్ని పరిపాలించాడన్నారు. గుర్తించిన ఉద్యమకారులు, నిరుద్యోగ యువత, అన్నివర్గాల లక్షలాది మంది ప్రజలు నడుం బిగించి రాష్ట్రానికి పట్టిన పీడ నుంచి విముక్తి కల్పించారన్నారు. డిసెంబర్ 3న కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి రాగా.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకాగాంధీ సహకారంతో మళ్లీ పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వచ్చిందన్నారు. మా తాతలు, ముత్తాతలు ముఖ్యమంత్రి కాదు.. రూ.లక్షల కోట్లు ఇవ్వలేదు.. మా అయ్య

చల్లా, మన్నెను గెలిపించాలి..

ఇప్పుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి.. ఈ ఎన్నికల్లో పార్టీ పరంగా మన్నె జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా ఏఐసీసీ ప్రకటించనుంది. ఆ రోజు నన్ను ఏ విధంగా గెలిపించారో.. జీవన్‌రెడ్డిని అదేవిధంగా గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఆయన జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యుల మర్యాదను కాపాడుతారన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో పాటు నాగర్‌కర్నూల్ అభ్యర్థిని గెలిపించాలని.. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. మూడు, ఆరు నెలల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని ఇటు కేసీఆర్, అటు మోదీ అంటున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. పాలమూరోడు సీఎం అయిండని కేసీఆర్ అసూయ పడుతున్నారని.. పాలమూరు బిడ్డ సీఎం కాకూడదా.. ఇక్కడి ప్రజలు విద్యావంతులు కాదా అని ప్రశ్నించారు. 2014లో నాగం జనార్దన్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎంపీగా నిలబడినప్పుడు పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇస్తామని మోదీ హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అసెంబ్లీ ఎన్నికల కంటే అధిక మెజార్టీ రావాలన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. పాలమూరులో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బొందపెట్టాలన్నారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రసంగించారు.

పేరు చెప్పుకొని ఈ కుర్చీలో కూర్చోలేదు.. 2006లో సామాన్య కార్యకర్తగా ప్రజలకు సేవలు చేయాలనే ఉద్దేశంతో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి గెలిచానని.. మిడ్జిల్ జెడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా మీరందరూ కష్టపడి నన్ను గెలిపించారన్నారు. తెలంగాణలో సీఎంగా నిటారుగా నిలబడి గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎవరితోనైనా కొట్లాడటానికి ఈ ధైర్యం ఉందంటే పాలమూరు బిడ్డలు ఇచ్చిన ఆత్మవిశ్వాసమే కారణం అన్నారు.



ఎంవీఎస్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం

వివరాలు 8లో ▸

బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు: మంత్రి జూపల్లి	ప్రజల రుణం తీర్చుకుంటాం..: మంత్రి కోమటిరెడ్డి	కేసీఆర్ దళిత వ్యతిరేకి: మంత్రి దామోదర రాజనర్సింహ	పాలమూరును ఎడారిగా మార్చారు: చల్లా వంశీచంద్‌రెడ్డి

సైడ్‌లైట్స్

- పాలమూరు ప్రజాదీవెన బహిరంగ సభ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగింది.
- సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.28 గంటలకు ఎంవీఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదికపైకి వచ్చారు.
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జీఎంఆర్ సీఎం **రేవంత్‌రెడ్డిని మొదట సత్కరించారు.**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి** ఆయన భారీ **చిత్రపటాన్ని కాంగ్రెస్ నేతలు** అందజేశారు.
- **రాత్రి 7.38 గంటలకు** సీఎం రేవంత్‌రెడ్డి **ప్రసంగం ప్రారంభమై.. రాత్రి** 8.17 గంటలకు **ముగిసింది. మొత్తం 39** నిమిషాల పాటు **మాట్లాడారు.**
- **రాత్రి 8.20 గంటలకు** సీఎం కాన్వాయ్ **సభాస్థలం నుంచి బయలు**దేరి క్రిస్టియన్‌పల్లి **నుంచి బైపాస్ మీదుగా** హైదరాబాద్ వెళ్లింది.
- **సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న** సమయంలో జనంలో మధ్యలో ఓ యువకుడు గురుకులాల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ప్లకార్డు ప్రదర్శించడంతో పోలీసులు అడ్డుకున్నారు.
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వగ్రామం రంగారెడ్డిగూడలో సీఎం రేవంత్‌రెడ్డి రాత్రి భోజనం చేశారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు.

న్యూస్‌రీల్

జోరుగా ఉల్లి వేలం

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి వేలం జోరుగా సాగింది. ఇతర ప్రాంతాల వ్యాపారులతో పాటు స్థానికులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. మార్కెట్‌కు దాదాపు 6 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ఉదయం 10కి ప్రారంభమైన వేలం మధ్యాహ్నం వరకు కొనసాగింది. నాణ్యమైన ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.1,650 ధర పలికింది. రెండో రకం ఉల్లి రూ.1,150 నమోదవగా.. గత వారం కన్నా రూ.50 తగ్గింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కిలోల బస్తాలు తూకం వేసి విక్రయించారు. బస్తా గరిష్టంగా రూ.850, కనిష్టంగా రూ.600 వరకు విక్రయించారు. ఇక ఎర్ర ఉల్లి బస్తా గరిష్టంగా రూ.550 నుంచి రూ.500 వరకు విక్రయించారు.



పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలి



పుర కమిషనర్లు, ఇంజినీర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: జిల్లాలోని అన్ని పురపాలికల్లో ఆస్తి పన్నులను వందశాతం వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని పుర కమిషనర్లు, ఇంజినీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను వసూళ్లలో అలసత్వం ప్రదర్శించొద్దని తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి లభ్యతలను నిర్ధారించుకొని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అంతేగాకుండా బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రదేశాల్లో చలివేంద్రాలు, పార్కుల్లో పక్షులు, ఇతర మూగజీవుల కొరకు నీటి కుంటలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో లక్ష్యానికి తగ్గట్లుగా మొక్కల పెంపకం చేలా చూడాలని, వార్డుల్లో ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో వనపర్తి పుర కమిషనర్ పూర్ణచందర్‌తో పాటు కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల కమిషనర్లు, డీఈలు, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి..

10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. బుధవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారులతో వెబెక్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇప్పటికే స్టడీ మెటీరియల్ అందిందని, వారికి ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులు నివృత్తి చేయాలన్నారు. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరగాలని, ఇంగ్లీష్, హిందీ, గణితంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆహార నియమాలు పాటించేలా చూడాలని.. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులకు చూపించాలన్నారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత, ఏఎస్‌సీడీఓ మల్లేషం, సూపరింటెండెంట్, హెడబ్ల్యూవోలు, ట్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు నిల్

- ముహూర్తం కోసం చూస్తున్న అభ్యర్థులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు 11 వరకు గడువు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 4న నోటిఫికేషన్ జారీ కావడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం విదితమే. కలెక్టరేట్‌లోని రూం నం.11లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ నామినేషన్లు స్వీకరిస్తున్నారు. మూడోరోజు బుధవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల రెండోరోజు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలుకు ఇంకా సమయం ఉండటంతో అభ్యర్థులు ముహూర్తం చూసుకొని దాఖలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఒకే ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. బీఆర్ఎస్ నుంచి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి ఆయా పార్టీలు తమ అభ్యర్థులుగా పేర్లు ఖరారు చేసిన నేపథ్యంలో ముహూర్తం చూసుకొని నామినేషన్లు వేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. కాగా.. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 11 వరకు సమయం ఉంది. ఇప్పటికే ఆయా ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఉపఎన్నికలో విజయం సాధించేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు ఇప్పటికే రహస్యంగా సంప్రదింపులు చేస్తున్నారు.

శ్రీశైలానికి 252 ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో బుధవారం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. ప్రతి ఏడాది రీజియన్‌లోని డిపోల నుంచి శ్రీశైలంకు మూడు రోజులపాటు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఈ ఏడాది 6, 7, 8 తేదీల్లో 252 ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మహాశివరాత్రి రోజు రీజియన్ నుంచి 161 బస్సులు నడపనున్నారు. అదేవిధంగా తిరుగు ప్రయాణం 9న శ్రీశైలం నుంచి 161 బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శివరాత్రిని పురస్కరించుకొని రీజియన్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, వీటిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. జిల్లాకేంద్రం బస్టాండ్ ఆవరణలో బుధవారం శ్రీశైలం స్పెషల్ బస్సుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆర్ఎం మాట్లాడుతూ శ్రీశైలం నుంచి భక్తుల తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీదుర్గ, డిపో మేనేజర్ సుజాత, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీశైలం స్పెషల్ స్టాల్

డిపో	6వ తేదీ	7వ తేదీ	8వ తేదీ
అచ్చంపేట	10	10	15
గద్వాల	4	4	12
కల్వకుర్తి	3	4	20
కొల్లాపూర్	2	4	18
మహబూబ్‌నగర్	12	14	33
నాగర్‌కర్నూల్	5	7	17
నారాయణపేట	3	3	15
షాద్‌నగర్	-	-	13
వనపర్తి	3	3	18

రాష్ట్రంలో కాంగ్రెస్ గారడీ చేస్తోంది



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంలో గారడీ చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకో ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడానికి బీఎస్పీ బీఆర్ఎస్‌తో జతకట్టిందని.. బహుజనులకు న్యాయం జరగాలనేదే పార్టీ లక్ష్యమన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి కారణమైన బీఆర్ఎస్‌తో కలవడం సంతోషకరమని తెలిపారు. బీఆర్ఎస్ పాలన కుంభకోణాల మయమని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక్క కుంభకోణం కూడా బయట పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు రోడ్ల మీదకి వస్తున్నారని.. ఉద్యోగ నియామకాల్లో మహిళలకు హారిజంటల్ రిజర్వేషన్లు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో బీఎస్పీ గెలవాలనే దృఢ నిశ్చయంతో పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్య, ఉద్యోగం, వ్యవసాయ రంగాల్లో ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడిందన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ కూటమి అభ్యర్థులు ఎక్కడెక్కడ కలిసి పోటీ చేస్తారనే విధివిధానాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

ఉమామహేశ్వరంలో పూజలు..

శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. 1977లో ఆలయంలో పూజలు చేశానని.. 47 ఏళ్ల తర్వాత తిరిగి పూజలు చేసినట్లు తెలిపారు. అందరి ఆశీస్సులతో ముందుకుసాగుతామన్నారు. ఆయన వెంట నాయకులు సూగూరిబాబు, మల్లయ్య, ఈశ్వర్, జాకీర్ హుస్సేన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్- 1బి, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 4,800 మందికిగాను 4,614 మంది హాజరుకాగా.. 186 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ పరీక్షలు 1,187 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా.. 1,099 హాజరుకాగా, 88 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 274 మంది విద్యార్థులు బుధవారం పరీక్షకు రాలేదని డీఐఈఓ మద్దిలేటి వివరించారు.

నిజాయితీతోనే సముచిత స్థానం



సన్మానసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా సోనియాగాంధీ తన పేరు ఖరారు చేసినా.. ప్రత్యర్థి డబ్బున్న వాడని, తన నిజాయితీ నిలువలేదని గుర్తించి తర్వాత టికెట్ మార్చారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి వివరించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులై బుధవారం తొలిసారి వనపర్తికి రావడంతో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సన్మానసభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తిరిగానని, ఎవరు నిలబడినా గెలుస్తారని అప్పుడే తెలుసని, పోటీచేసి గెలిచి ఉంటే మంత్రి పదవి దక్కేదని తెలిపారు. తనకున్న గుర్తింపుతోనే సీఎం రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని, వనపర్తి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో పార్టీలు మారడం చూస్తుంటామని.. తన టికెట్ మార్చినా గీసిన గీత దాటనని అధిష్టానం పెద్దలకు అప్పుడే చెప్పానని గుర్తుచేశారు. వనపర్తికి ఫారెస్ట్ యూనివర్సిటీతో పాటు పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాజమహల్‌కు పూర్వ వైభవం, జిల్లాకేంద్రానికి రైల్వేలైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కాగా మంగళవారం రాత్రి ఎమ్మెల్యే మేఘారెడ్డిని చిన్నారెడ్డి ఆహ్వానించారని ప్రచారం జరిగినా.. ఎమ్మెల్యే సమావేశానికి హాజరు కాకపోవడం సభలో చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఆదిత్యరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు సయ్యద్ అక్తర్, బి.కృష్ణ, కిరణ్‌కుమార్, శంకర్‌ప్రసాద్, కె.రవి, బాబా, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి ఘన స్వాగతం

గోపాల్‌పేట: రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపటి మొదటిసారి మండలంలోని బుద్ధారం చేరుకున్న చిన్నారెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గండి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గోపాల్‌పేటకు చేరుకోగా క్రేన్‌తో గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్‌గాంధీ, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. బుధవారం పెద్దమందడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని.. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రఘుపతిరెడ్డి, వేణుయాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, మన్నెపురెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, నాగేంద్రయాదవ్, శశివర్ధన్‌రెడ్డి, సత్యశీలారెడ్డి, సేనాపతి, పుల్లన్న, భీంరెడ్డి, జానకిరాములు, కొన్నూర్ శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చెంచుల పండుగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 9 వరకు భౌరాపూర్ ఉత్సవాలు
- మూడు రోజుల జాతరతో పులకించనున్న అడవి తల్లి
- 8న భ్రమరాంబిక, మల్లన్న కల్యాణం
- వివిధ జిల్లాల నుంచి చెంచుల రాక
- ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



ఆలయంలో కొలువుదీరిన శివయ్య



భౌరాపూర్ జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట: ఏటా శివరాత్రి పర్వదినాన నల్లమలలోని భౌరాపూర్ భ్రమరాంబ ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చెంచుల పండుగ నిర్వహిస్తోంది. గురువారం నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఈ నెల 5న అధికారులతో సమావేశం నిర్వహించి సౌకర్యాల కల్పనపై పలు సూచనలు చేశారు. పురాతన ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి మహాశివరాత్రి రోజున శ్రీశైలంలో జరిగే ఉత్సవాల తరహాలోనే ఇక్కడ కూడా కల్యాణం జరిపిస్తారు. ఎనిమిది ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తోంది. అప్పట్లో శ్రీశైలానికి, భౌరాపూర్ మీదుగా కాకుండా వటువర్లపల్లి– దోమలపెంట మీదుగా రోడ్డు వేశారు. దీంతో పట్టించుకునే వారు లేక ఎంతో ప్రసిద్ధి చెందిన భౌరాపూర్ ఉత్సవాలు మరుగునపడ్డాయి. అదివాసీ సంప్రదాయ ఉత్సవాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో అన్ని చెంచుపెంటలు గ్రామాల్లో ప్రచారం కల్పించారు. దీంతో పాటు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత చెంచు గిరిజనులు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కలిసి ఇక్కడి పరిస్థితి వివరించడంతో నాటి నుంచి ప్రభుత్వం అధికారికంగా ఈ పండుగను నిర్వహిస్తోంది.

ఆలయ ప్రాశస్త్యం..

నల్లమల అడవిలో భౌరపూర్ ఆలయంలో భ్రమరాంభికాదేవి, శివయ్యలు వెలిశారు. ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం నుంచి భక్తులు అడవిమార్గంలో బౌరాపూర్ మీదుగా కాలినడకన నడిచి వెళ్లేవారు. అయితే చెంచుల ఆడబిడ్డ శివుని భార్య అయిన భ్రమరాంభికాదేవి ప్రతిరూపంతో అప్పటికే చెంచులు తమ సంస్కృతి సాంప్రదాయాలతో కొలుస్తుండేవారు. వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వచ్చిపోయే భక్తులు భౌరాపూర్ వద్ద బస చేసి ఇక్కడ సేదతీరే వారని, తిరిగి ఇక్కడి నుంచి ప్రయాణాన్ని కొనసాగించేవారని చెబుతుంటారు. ఈ క్రమంలో ఇక్కడి రాజ్యాన్ని పాలించిన రెడ్డి రాజులు, చాళుక్యులు, ఇక్ష్వాకుల కాలంలో భౌరాపూర్ చెరువు వద్ద భ్రమరాంభికాదేవి ఆలయ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆలయానికి ఎదురుగా చెరువు కట్టపై వీరభద్రుడు, మూడు కిలోమీటర్ల దూరంలో నైరుతి వైపున వంటివీరన్న(వీరభద్రుడు) వెలిశారు.

ఇలా వెళ్లాలి..

జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో పర్హాబాద్ చౌరస్తా వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ప్రధాన రహదారి నుంచి 15 కిలోమీటర్లు అటవీ ప్రాంతం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఉత్సవాల నిర్వాహకులు, అధికారులు జాతరకు వెళ్లే మార్గాన్ని సూచిస్తూ.. ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చేవారు శ్రీశైలం నుంచి పర్హాబాద్ చౌరస్తా చెక్‌పోస్టు వద్దకు వచ్చి అటవీ మార్గంలో భౌరాపూర్ చేరుకోవచ్చు. అప్పాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండటంతో ప్రత్యేకాధికారి, కార్యదర్శి, ఆలయ కమిటీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.



ముస్తాబైన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం

కార్యక్రమాలు ఇలా..

ప్రభుత్వ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వాగతోపన్యాసం కార్యక్రమాలు, సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు చెంచుల సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, చెంచుల ఆట- పాట, శివనామస్మరణ, జాగరణ, సాంప్రదాయ నృత్యాలు ఉంటాయి. 8న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 9.55 వరకు అల్పాహారం, 10 నుంచి 11 గంటల వరకు ముఖ్య అతిథిలకు స్వాగతం, వేదపండితులతో గణపతి పూజ, రుద్రహోమం, అభిషేకం, అంకురార్పణ అనంతరం 11 గంటలకు భ్రమరాంబ, మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహిస్తారు. 9న అమ్మవారు, స్వామివారికి ప్రత్యేక పూజలు, జాతర ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.

అధికారులకు బాధ్యతలు..

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్లాస్టిక్ వినియోగించకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ అలంకరణ, విద్యుద్ధీకరణ, వైద్యసేవలు, 108, ఫైరింజన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అటవీ, పోలీస్‌శాఖ సమన్వయంతో పర్యవేక్షించనున్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు, మార్గమధ్యంలో పెంటల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

నిబంధనలు పాటించాలి

మన్ననూర్: అటవీ ప్రాంతంలో జరిగే భౌరాపూర్ భ్రమరాంబికాదేవి ఉత్సవాలకు వచ్చే భక్తులు నియమ నిబంధనలు పాటించాలని ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. జాతరకు చెంచులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, మీడియాకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అటవీ పరిసర ప్రాంతాల్లో నిప్పు పెట్టడం, ధూమపానం, మద్యం సేవించడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరకు వచ్చే నాలుగు చక్రాల వాహనాలకు రూ. 500 టోల్ చార్జీ ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అలీపీర్ (ఫైల్)

గద్వాల క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మానవపాడు మండలం అమరవాయికి చెందిన ఆర్‌ఎంపీ అలీపీర్ (42) కొన్నేళ్లుగా పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి నిమిత్తం స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో క్లినిక్ ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం క్లినిక్‌కు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి బయటికి వచ్చాడు. బుధవారం క్లినిక్ పైభాగంలో అలీపీర్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రెండు రోజుల కిందట అతడు మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. కాగా, మృతుడు అలీపీర్‌కు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఈవిషయంపై కొన్ని నెలల కిందట మృతుడి కుటుంబ సభ్యులతో సదరు మహిళ కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ గొడవలే అలీపీర్ మృతికి కారణమై ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉంటే సోమవారం నుంచి అదృశ్యమైన అలీపీర్ కోసం కుటుంబ సభ్యులు వాకబు చేయకపోవడం, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మృతదేహంపై బలమైన గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య అమీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ టాటాబాబు తెలిపారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

అచ్చంపేట రూరల్: అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాంనగర్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన యాదమ్మ(40) పట్టణంలో చిరువ్యాపారం నిర్వహిస్తుండేది. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతురాలి సోదరుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ (33) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవాడు. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని వేంకటేశ్వర కాలనీ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

తల్లిదండ్రుల గొడవను అడ్డుకోబోయిన కొడుకు..

- తాగిన మైకంలో కుమారుడిపై కత్తితో దాడి చేసిన తండ్రి
- ఆస్పత్రికి తీసుకెళుతుండగా... మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లా నంది వడ్డేమాన్‌లో ఘటన



శివ మృతదేహం

బిజినేపల్లి: తల్లిదండ్రులు గొడవ పడుతుండగా.. అడ్డుకోబోయిన కుమారుడిని తండ్రి కత్తితో పొడిచి హతమార్చిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన నాగయ్య భార్య తిరుపతమ్మ శుభకార్యం కోసమని బంధువుల ఇంటికి వెళ్లి.. మూడు రోజుల తర్వాత వచ్చింది. ఇన్ని రోజులు వెళితే.. మాకు ఇంటి వద్ద ఎవరు వండిపెడతారని ఇంటిని ఎవరు చూసుకుంటారని భార్య తిరుపతమ్మపై భర్త నాగయ్య మండిపడ్డారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి పెద్ద గొడవకు దారి తీసింది. అప్పటికే తాగి ఉన్న నాగయ్య భార్యను కొట్టాడు. ఇదంతా చూసిన కొడుకు శివ (20) మధ్యలో కల్పించుకుని వారిని వారించే ప్రయత్నం చేశాడు. తాగిన మైకంలో ఉన్న నాగయ్య కత్తితో శివపై కత్తితో దాడి చేశాడు. దీంతో శివకు మూడు కత్తిపోట్లు పడడంతో తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన తల్లి తిరుపతమ్మ వెంటనే స్థానికుల సహాయంతో కొడుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గం మధ్యలోనే మృతి చెందాడు. తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళకు శస్త్రచికిత్స చేసిన ఎమ్మెల్యే



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

లింగాల: మండలంలోని అవుసలికుంటకు చెందిన బాలమణి గర్భసంచి సమస్యతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ బుధవారం అచ్చంపేట ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. కొన్నిరోజుల కిందట ఇదే మండలంలోని జీల్గుపల్లికి చెందిన ప్రసన్న పురిటి నొప్పులతో ఇబ్బందులు పడుతుండగా కాన్పు చేశారు. ఎమ్మెల్యేగా ఉండి వైద్యవృత్తిని మరువక ప్రజాసేవలో భాగంగా శస్త్రచికిత్సలు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత




పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. గద్వాల వైపు నుంచి 30 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు బోలెరా వాహనంలో తరలిస్తుండగా, నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. వాహనాన్ని అక్కడే వదిలి డ్రైవర్ తప్పించుకున్నాడు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ జనార్దన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

సాక్షి నాగర్‌కర్నూల్/పాలమూరు:బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను ఓట్లు అడిగే హక్కును కోల్పోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే కొన్ని అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. పాలమూరు ప్రాజెక్టును మొదలుపెట్టి పదేళ్లు అయినా 30 శాతం కూడా పూర్తిచేయలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లను గెలిపించాలని కోరారు.



ప్రజల రుణం తీర్చుకుంటాం..




పాలమూరు అంటే మానవత్వానికి మారు పేరు.. కవులు, కళాకారులకు పుట్టినిల్లు.. కష్టపడే మనస్తత్వం ఇక్కడి వారిదని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పదేళ్ల రాక్షస పాలన నుంచి విముక్తి కల్పించిన ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. జిల్లాకేంద్రంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే యెన్నం కోరారని, తప్పకుండా చేపడతామన్నారు. ఇప్పటికే రూ.20 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచామని, మన్యంకొండ రోప్‌వే కోసం రూ.75 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉదండాపూర్ భూ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

కేసీఆర్ దళిత వ్యతిరేకి




గత ప్రభుత్వంలో తెలంగాణ సమాజం కుటుంబ పాలనలో బందీ అయిందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో దోపిడీ, అరాచకం రాజ్యమేలిందని, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ దళిత వ్యతిరేకి అని.. ఆ రోజు సమైక్య రాష్ట్రంలో దళితుడిని సీఎం, ఉప ముఖ్యమంత్రులను చేసింది, ఆదివాసీలు, దళితులకు 25 లక్షల ఎకరాల భూములను ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేన్నారు. కానీ, తొమ్మిదిన్నరేళ్లలో ధరణి వల్ల ఆ భూములకు రక్షణ లేకుండా పోయిందని దుయ్యబట్టారు.

పాలమూరును ఎడారిగా మార్చారు..



ఎంపీగా గెలిపించిన పాలమూరు జిల్లాను కేసీఆర్ ఎడారిగా మార్చారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఆనాడు దివంగత నేత వైఎస్‌ఆర్ ప్రారంభించిన జలయజ్ఞం ప్రాజెక్టులతోనే మనకు నీళ్లు పారుతున్నాయన్నారు. కానీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలను నిర్లక్ష్యం చేసి ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు ఇవ్వలేదని ఆరోపించారు.

ఎవరెవరు ఏమన్నారంటే..



అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాక కోసం జిల్లా ఎదురుచూసిందన్నారు. మన జిల్లా బిడ్డ రేవంత్‌రెడ్డి పదవీ చేపట్టిన కొద్దిరోజుల్లోనే పేట- కొడంగల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, జిల్లాను విద్యాహబ్‌గా మారుస్తామని, అనేక విద్యాసంస్థల స్థాపనకు శ్రీకారం చుడుతున్నామన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల ఆశీర్వాదం వల్లే ఉమ్మడి జిల్లాలో 12 సీట్లు గెలిచామని, అదే స్ఫూర్తితో రెండు ఎంపీ సీట్లు గెలుద్దామన్నారు. పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుక మాఫియా, భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలు లేకుండా పాలన సాగుతోందన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడి కాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను నిర్లక్ష్యం చేసిందన్నారు. పాలమూరు బిడ్డకు సీఎం పదవి రావడం అభినందనీయమని, మనందరం అండగా నిలుద్దామని కోరారు. రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డిగూడలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి


జోగుళాంబకు అష్టబంధ ద్రవ్య సమర్పణ



సంప్రదాయరీతిలో అష్టబంధనాన్ని తయారు చేస్తున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లోని జోగుళాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం మూడోరోజు అర్చకులు అష్టబంధన ద్రవ్యాలు సమర్పించారు. 12 ఏళ్లకోసారి గర్భాలయంలో మరమ్మతులు, పీఠానికి బంధనం వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది. అమ్మవారి బింబం, ఆనంద నిలయాన్ని తేజోవంతం చేయడానికి అష్టబంధన ద్రవ్యాలు సమర్పిస్తుంటారని ఆచార్యులు తెలిపారు. అష్టబంధనానికి నీరు సున్నం 150 గ్రాములు, గుగ్గిలం 100 గ్రాములు, లక్క 50 గ్రాములు, తుమ్మబంక 25 గ్రాములు, తేనె మైనం 12.5 గ్రాములు, దూది 6 గ్రాములు, వెలుగ గుజ్జు 6 గ్రాములు, వెన్న తగినంత వినియోగించారు. స్వస్తి వాచకాల మధ్య సాంప్రదాయరీతిలో ఆచార్యుల పర్యవేక్షణలో చూర్ణం చేస్తూ అష్టబంధనాన్ని తయారు చేశారు. దీనిని అమ్మవారి పద్మపీఠంపై అన్ని దిక్కుల్లో సమర్పించారు. ఏకాంతంగా జరిగే ఈ కార్యక్రమం కోసం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు భక్తులకు దర్శనాన్ని నిలిపివేసినట్లు ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. ఇదిలా ఉండగా యాగశాలలో త్రికాల సమయాల్లో నిత్యపూజలు నిర్వహించారు. రాత్రి బాలాలయంలో దశవిధ హారతులిచ్చి తీర్థ, ప్రసాద వితరణ వేద ఆశీర్వచనం చేశారు.

అంతర్రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన



తలపడుతున్న పొట్టేళ్లు

అయిజ: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ మైదానంలో అంతర్రాష్ట్రస్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 30 పొటేళ్లు హోరా హోరీగా తలపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన కిల్లర్ గ్రూప్ పొటేలు మొదటి బహుమతి రూ. 50,016 గెలుచుకుంది. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ షిప్ ఫైటర్ పొటేలు రెండో బహుమతి రూ. 35,016, ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా గొందిపర్లకు చెందిన ప్రభాస్ పొటేలు మూడో బహుమతి రూ. 20,016, నంద్యాలకు చెందిన రమేష్ ఆంధ్రకట్ల పొటేలు 4వ బహుమతి రూ. 10,016ను కైవసం చేసుకున్నాయి. బల ప్రదర్శనను చూసేందుకు వివిధ మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

మొబైల్ లేడీస్ కార్నర్ వాహనం దహనం

ధరూరు: మండల కేంద్రానికి చెందిన హోలియా దాసరి జయరామ్ కొన్నేళ్లుగా తోపుడు బండి ఏర్పాటు చేసుకుని భార్య, భర్తలిద్దరు కలిసి ఊరూరు తిరుగుతూ.. లేడీస్ కార్నర్‌లో లభించే వస్తువులను అమ్మేవారు. వారం రోజులుగా బ్రహ్మోత్సవాలు ఉండడంతో జయరాం రూ.2లక్షలు అప్పు చేసి సామగ్రి కొనుగోలు చేశారు. మంగళవారం ఇంటి వద్ద తన ఆటోలోనే బండి ఉంచి నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రితో సహా వాహనాన్ని అంటించారు. గమనించిన దాసరి జయరాం కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు మేల్కొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే తోపుడు బండిలో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. అనుమానం వ్యక్తుల మీద ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గద్వాలలో సినీ నటి మెహ్రీన్ సందడి



జ్యోతి ప్రజ్వలన చేసి కాసం షోరూంను ప్రారంభిస్తున్న సినీ నటి మెహ్రీన్

గద్వాల అర్బన్: గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం సినీ నటి మెహ్రీన్ పిర్జాదా సందడిచేశారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటుచేసిన కాసం ఫ్యాషన్స్ షోరూంను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం షోరూంలోని చీరలను పరిశీలించారు. మెహ్రీన్ పిర్జాదాను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో షోరూం పరిసర ప్రాంతం కిటకిటలాడింది. షోరూం ఎదుట ఏర్పాటుచేసిన స్టేజీపై మెహ్రీన్ పిర్జాదా అభిమానులకు అభివాదం చేస్తూ, జోష్ నింపారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పలువురు పోటీపడ్డారు. అనంతరం మెహ్రీన్ పిర్జాదా విలేకరులతో మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా గద్వాలకు రావడం జరిగిందని, ఇక్కడి వారు ఎంతో అభిమానం చూపించారన్నారు. ఈ మధ్యకాలంలో హిందీ, తెలుగు భాషాల్లో నటించానని.. త్వరలోనే ఆ సినిమాలు విడుదల అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో షోరూం యాజమాన్యం కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్ పాల్గొన్నారు.

చోరీలపై డీఎస్పీ విచారణ

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలం గొరిటలో వరుస చోరీలపై నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన రాములు, తిరుపతమ్మ ఇళ్లలో మొత్తం రూ.10 లక్షల నగదు, 21 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను ఇళ్లలో దాచుకోవడంపై డీఎస్పీ ఆరా తీశారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించడంతో పాటు చుట్టు పక్కల వారిని ప్రత్యేకంగా విచారించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈసందర్భంగా సీఐ కనకయ్యగౌడ్ ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE
■ MVR రియాల్టి గ్రూప్ మహబూబ్‌నగర్‌లో మన్యంకొండకు ఆనుకొని బెంగుళూరు రోడ్డుకు దగ్గరలో సెవెన్‌హిల్స్ శాండల్ వుడ్ ఫామ్ ల్యాండ్ అమ్మబడును.సంప్ర।। సెల్: 9391745197, 9440299999

PLOT FOR SALE
■ 101 Acres Project HMDA & DTCP Approved premium villa Plots Rs. 8499/- to 18,000/- on Sri Shailam & Sagar H/W facing. Ph: 9900043444

SERVICES

BUSINESS OFFER
■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 8550606222.

WANTED
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 8573633520,89197 39694.
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584.
■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k ఫోన్: 9640258899 / 9640468899.

■ Raymands Cloth Show Room జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఇంఛార్జ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్ కావలెను. సెల్ : 8482801889.
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 8391088831, 8246585901.
■ నర్మద హోండా షోరూం మహబూబ్‌నగర్, వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జ్, మెకానిక్‌లు కావలెను. సెల్ : 9493159185.

భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు -సాక్షి మేనేజర్